క్లుప్తంగా

మహిళలకు చీరలు పంపిణీ



నగరంపాలెం: ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇశ్రాయేల్‌పేట ఒకటో వీధిలో సినీ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేయగా, మహిళలకు చీరలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుంట్ల రాజాబాబు మాట్లాడుతూ ప్రభాస్ నేటి యువతరానికి ఆదర్శనమని అన్నారు. ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు అందరికి ఆదర్శనీయమని కొనియాడారు. స్వర్ణసు మంత్, ఏసురాజు, లాజర్, సుందరరావు, నాగసాయి, గోపీసాధిక్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్ధాబత్తినవారి వీధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 16వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

అన్నమ్మ, నరసింహారావుల జీవితం ఆదర్శప్రాయం



గుంటూరు ఎడ్యుకేషన్: నిజమైన మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావాలకు ప్రభావితమై దశాబ్దాల పాటు మానవీయ సంబంధాలకు ప్రతీకగా నిలిచిన నక్కా అన్నమ్మ, నరసింహారావు ఆదర్శ దంపతుల జీవితం ఆదర్శప్రాయమని సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు జి.హరగోపాల్ పేర్కొన్నారు. శ్రీకరం చలమయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నక్కా అన్నమ్మ ద్వితీయ స్మారక సభను మంగళవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ శీలం లక్ష్మారెడ్డి వేదికపై బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ నాయకుడు కె.రవిచందర్ అధ్యక్షతన 'భారతదేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు' అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. ఈసందర్భంగా జి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎన్వీ నరసింహారావు రచించిన 'నేను నా 75 సంవత్సరాల సామాజిక జీవితం' పుస్తకాన్ని పౌర హక్కుల సంఘం ఏపీ, నాయకుడు డాక్టర్ రాజారావు ఆవిష్కరించారు. విప్లవ రచయితల సంఘం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ పుస్తక పరిచయాన్ని చేశారు. రెండవ సమావేశానికి విరసం నల్లూరి రుక్మిణి అధ్యక్షత వహించగా అన్నమ్మ స్మారకోపన్యాసం 'మహిళా సాధికారిత, రిజర్వేషన్లపై' సామాజిక విశ్లేషకురాలు కె.సజయ మాట్లాడారు. మూడవ సమావేశానికి ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు ఎస్.శామ్యూల్ అధ్యక్షత వహించగా 'ఫాసిజం, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, అంశాలు' అంశంపై ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ ఉపన్యసించారు.

వైభవంగా విజయదశమి వేడుకలు

- పలు రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేయించుకున్న భక్తులు
- కనుల పండువగా అమ్మవారి గ్రామోత్సవం



అష్టలక్ష్మీ ఆలయంలో మహిషాసుర మర్దినిగా..

పాత గుంటూరు: నగరంలో విజయదశమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకొన్నారు. పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారి గ్రామోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు.

- బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం విజయదశమి సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి విశేష పూజలు, పారాయణాలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో శమీపూజ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మహతీ స్వరసుధ వారి భక్తి సంగీత విభావరి జరిగింది. గాయకులు అమ్మవారి సంకీర్తనలు ఆలపించారు.

- విద్యానగర్‌లోని సాయినాథ సన్నిధానంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాటాలు, డప్పు వాయిద్యాలు, డాన్సలతో గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.



బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకున్న అమ్మవారు



మల్లారెడ్డినగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు



విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో పూజలందుకున్న అమ్మవారు

రాజరాజేశ్వరీదేవిగా...

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లిఖార్జునపేటలోని గంగా భ్రమరాంబికా సమేత మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానంలో సోమవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చారు.

భక్తులకు అన్నదానం

పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని పోతురాజులు, పోలేరమ్మ తల్లి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. విజయదశమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.



విద్యానగర్‌లో అమ్మవారి గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళలు



విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో అమ్మవారి గ్రామోత్సవం

సీపీఐ రామకృష్ణకు మతిభ్రమించింది



మాట్లాడుతున్న పాండురంగ విఠల్

గుంటూరు మెడికల్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టు వెనుక బీజేపీ హస్తం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెప్పడం అతనికి మతిభ్రమించిందనడానికి నిదర్శనమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలవర్తిపాటి పాండురంగ విఠల్ అన్నారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తనయుడు లోకేష్ తన తండ్రి అరెస్టులో కేంద్ర హస్తం ఉన్నట్లు ఎక్కడా కనిపించడం లేదని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. సొంత కొడుకు కేంద్ర ప్రభుత్వం హస్తం లేదని ప్రకటిస్తే రాజకీయ ఉనికి కోసం సీపీఐ రామకృష్ణ కేంద్ర హస్తం ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్నవారు ఆరోపణలు చేసే ముందు జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. రాజ్యాంగ బద్ధమైన సంస్థలు ప్రతి అభియోగంపై ఎంతో కొంత విచారణ చేసి అరెస్టు చేస్తాయని, రాజకీయ పార్టీల ప్రమేయం ఉండదనే విషయాన్ని రామకృష్ణ తెలుసుకోవాలని సూచించారు.

జీజీహెచ్‌లో విజయదశమి సంబరాలు



విజయదశమి పూజల్లో పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. విజయదశమి సందర్భంగా ఆసుపత్రిలో వివిధ ఆపరేషన్ థియేటర్లలో నిర్వహించిన ఆయుధ పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడుపై మంచిని సాధించిన విజయంగా ఈ పండుగ చేసుకుంటామన్నారు. జీజీహెచ్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రోగుల కోసం రెండు ఆపరేషన్ థియేటర్లలో శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఎముకలు, కీళ్ల విభాగం ఆపరేషన్ థియేటర్, సర్జరీ థియేటర్లలో కూడా వసతులను ఆధునీకరించామని చెప్పారు. బ్లడ్ బ్యాంక్‌ను కూడా ఆపరేషన్ థియేటర్లకు దగ్గరగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. దాతలు ఇచ్చిన సొమ్మును సద్వినియోగం జరిగే విధంగా చూడాలన్నారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

అలరించిన పౌరాణిక రంగస్థల ఏకపాత్ర పోటీలు

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల పౌరాణిక రంగస్థల ఏకపాత్ర పోటీలు జరిగాయి. ఈ పోటీలను టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, కాపునాడు గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగ్గా, 55 మంది హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా రంగస్థల నటుడు సింగర కొండయ్యచౌదరి, ప్రముఖ కవయిత్రి తుమ్మల స్నిగ్ధమాధవి, జి.గంగాధర్‌రావు, వ్యాఖ్యాతగా పి.కృష్ణారావు వ్యవహరించారు. హార్మోనిస్ట్ శిరిగిరి సాంబశివరావు, వెంకటేశ్వరరావు వాద్య సహకారం అందించారు. ప్రథమ బహుమతి రూ.6 వేలను బాపనపల్లి వెంకటస్వామి (రావణ బ్రహ్మ పాత్ర), ద్వితీయ బహుమతి రూ.5వేలు కేశన నాగేశ్వరరావు (అర్జునుడు పాత్ర), తృతీయ బహుమతుల కింద ఇద్దరికి రూ.2 వేలు చొప్పున అందజేయగా, పలువురికి ప్రత్యేక బహుమతులు అందజేశారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

వడ్డమాను(తాడికొండ): తుళ్లూరు మండలం వడ్డమానులో ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడిన పది మంది ఉద్యోగులు వెల్ విషర్ టీం ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా 15 మంది వృద్ధులు, పేదలకు నిత్యావసరాలు, రగ్గులు అందించారు. గ్రామంలో ఉత్తమ ప్రతిభతో ఉత్తీర్ణత సాధించిన కూరపాటి అంజలికి ఇంటర్ ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతుండగా స్పందించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. తొలి విడత సాయంగా రూ.9 వేలు ఫీజు చెల్లించిన రసీదు అందజేశారు. కార్యక్రమంలో వెల్ విషర్ అధ్యక్షుడు మాజీ సబ్ రిజిస్ట్రార్ బెజ్జం నాగేశ్వరరావు, బెజ్జం ఫౌండేషన్ అధ్యక్షుడు బెజ్జం రామకృష్ణారావు పాల్గొన్నారు.

చిన్నం యువరాజుకు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సాంకేతిక సలహాదారుడు చిన్నం యువరాజుకు కాకినాడలోని జేఎన్‌టీయూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. 'జియో స్పేషియల్ టెక్నాలజీస్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టూల్స్ ఫర్ డిసీస్ ప్యాటర్న్ డిఫ్యూజన్ ఎనాలసిస్ అండ్ మాపింగ్' అనే అంశంపై కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆర్థిక సహకారంతో చేసిన పరిశోధనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేస్తూ, జేఎన్‌టీయూ ఎవాల్యుయేషన్ డైరెక్టర్ బి.బాలకృష్ణ నోటిఫికేషన్ విడుదల చేశారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ అయ్యంకి మురళీకృష్ణ, ప్రముఖ పర్యావరణ ఇంజినీర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు చిన్నం యువరాజు పీహెచ్‌డీ పట్టా పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. కృత్రిమ మేథ సహకారంతో నూతన ఆవిష్కరణకు ఈ పరిశోధన దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ యువరాజుకు అభినందనలు తెలియజేశారు.

చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

పెదకాకాని: అసభ్యంగా వాట్సాప్ వీడియోలు పెట్టడంతో పాటు చంపుతానని బెదిరించడంపై మంగళవారం కేసు నమోదయింది. పెదకాకాని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయంలో నంబూరు గ్రామానికి చెందిన నంబూరు యోబు డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. ఏఎన్‌యులో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌లో ఎన్నికయ్యారు. అదే వర్సిటీలో డైలీవైజ్ పనిచేస్తున్న నంబూరు అబ్రహాం వాట్సాప్‌లో వీడియోలు పోస్టు చేస్తూ నంబూరు యోబు పట్ల అసభ్యంగా మాట్లాడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అలానే ఈనెల 15వ తేదీన నంబూరు యోబు కారులో వెళుతుండగా కారుకు అడ్డుగా వెళ్లి.. ఆపి నీ గురించి వాట్సాప్‌లో వీడియోలు పెట్టాను, నువ్వు ఏం చేయలేవు అంటూ హెచ్చరించడమే కాకుండా నాకు ఎదురు పడితే నిన్ను చంపుతానని బెదిరించాడు. దీంతో పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని బాధితుడు యోబు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నంబూరు అబ్రహాంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు శనివారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

నిరుపేదల గుండెచప్పుడు ఎస్.ఆర్.శంకరన్

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో సంస్మరణ సభ



సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: జీవితమంతా పీడిత ప్రజల సంక్షేమం కోసం పాటుబడిన ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్.శంకరన్ బడుగు జన బాంధవుడిగా, నిరుపేదల గుండె చప్పుడుగా పేరొందారని సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్వర్గీయ ఎస్.ఆర్.శంకరన్ సంస్మరణ సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి ఎస్.ఆర్. శంకరన్ జీవితం అంకితం చేశారన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం అనే పదానికి నిర్వచనం ఇచ్చి చట్ట పరిధిలో అమలు చేసిన ఆ మహనీయుడిని నేటి తరం అధికారులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పేదలకు ఉండాల్సిన హక్కుల్ని సంక్షేమ పథకాల్ని వారికే దక్కేలా శంకరన్ కృషి చేశారని గుర్తు చేశారు. సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన సభ్యులు ఎస్ ఆర్ శంకరన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పేదరిక రహిత సమాజస్థాపనకు

ముఖ్యమంత్రి కృషి



కళ్లజోళ్లు అందుకున్న గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- నాలుగు గ్రామాల్లో 752 మందికి కళ్లజోళ్లు పంపిణీ



తంగెళ్లమూడికి చెందిన వృద్ధ దివ్యాంగునికి కళ్లజోడు పెడుతున్న అంబటి మురళీకృష్ణ

శేకూరు(చేబ్రోలు): పేదరిక రహిత సమాజ స్థాపనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టి, దార్శనికత స్ఫూర్తిదాయకమని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో ఈనెల 15వ తేదీన బజరంగ్ జగనన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన 752 మందికి వారి లోపం ఆధారంగా వ్యక్తిగత కళ్లజోళ్లను సిద్ధం చేసిన బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ సోమ, మంగళవారం రెండు రోజుల పాటు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఏళ్ల తరబడి దృష్టిలోపం ఉన్న వారి సమస్యకి కేవలం ఒక కళ్లజోడు పరిష్కారం ఇస్తుందని అదేవిధంగా సుదీర్ఘకాలం పాటు పేదరికం, వెనకబాటుతనంతో మగ్గుతున్నవారికి జగనన్న సంక్షేమ పథకాలు ఊరట కలిగించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయన్నారు. బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఆర్థిక స్తోమత లేని వెనుకబడిన వర్గాల ప్రజానీకానికి నేత్ర సమస్యల నుంచి ఉపశమనం కలిగించటానికి చిత్త శుద్ధితో శ్రమిస్తున్నదన్నారు. సేవా కార్యక్రమాలను పేదల ముంగింట్లోకి తీసుకువచ్చి ఎక్కడ ఉండే వారికి అక్కడే శిబిరాలను ఏర్పాటు చేసి నిపుణలైన వైద్యుల ద్వారా వైద్య పరీక్షలను జరిపించినట్లు తెలిపారు. ఎవరి వ్యక్తిగత సమస్యను బట్టి వారికి వ్యక్తిగత కళ్లజోళ్లను ప్రత్యేకంగా తయారు చేయించి, శిబిరం పూర్తి అయిన ఏడు పని దినాలలోనే వారికి కళ్లజోళ్లను అందించటం జరిగిందన్నారు. వీర నాయకునిపాలెం గ్రామాల్లో 46మందికి, అనమర్లమూడి గ్రామంలో 53మందికి, తంగెళ్లమూడి గ్రామంలో 65 మందికి కళ్లజోళ్లను అందజేశారు. అదేవిధంగా శేకూరు గ్రామంలో 588 మందికి బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చేతుల మీదుగా కళ్లజోళ్లను అందించటం జరిగింది. బజరంగ్ సామాజికి సేవా విభాగం బృంద సభ్యులు ఆద్యంతం ఈ పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించటంలో కృషి చేశారు.

రోగులకు పెద్ద అండ!



విట్టా వెంకటేశ్వర్లుతో డాక్టర్ కిరణ్‌కుమార్

ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు విట్టా వెంకటేశ్వర్లు. వయస్సు 70 సంవత్సరాలు. ప్రకాశం జిల్లా జరుగుమిల్లు మండలం నందనవనం గ్రామానికి చెందిన ఈ వృద్ధుడు నెలరోజులుగా కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, తినే ఆహారం అరగక వాంతులు అవడం, ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడడం, తీవ్ర ఆయాసం, నిద్రపట్టకపోవడం, తదితర సమస్యలతో బాధపడుతున్నాడు. 2023 ఫిబ్రవరిలో గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్యులను సంప్రదించగా అడ్మిట్ చేసుకుని ఆపరేషన్ చేశారు. వైద్యులు వృద్ధుడికి ఆపరేషన్ చేస్తున్న సమయంలో సడన్‌గా గుండె ఆగిపోయింది. తక్షణమే అప్రమత్తమైన జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ నేరుగా కడుపులో నుంచి చేతిని గుండెపైకి పంపించి గుండెకు మసాజ్ చేసి ఆగిన గుండెను కొట్టుకునేలా చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడారు.



జనరల్ సర్జరీ వైద్య విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

జీజీహెచ్ సర్జరీ వైద్యవిభాగంలో కార్పొరేట్ వైద్యసేవలు

- ప్రతిరోజూ పదికి పైగా ఆపరేషన్లు
- రూ.10లక్షలకు పైగా ఖరీదు చేసే ఆపరేషన్లు సైతం ఉచితంగానే..
- ల్యాప్రోస్కోపి లాంటి ఆధునిక ఆపరేషన్లు సైతం..
- ప్రభుత్వ సహకారంతో రోగుల ప్రాణాలు నిలబెడుతున్న వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా వైద్య సేవలను అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అత్యాధునిక వైద్య పరికరాలను సర్జరీ వైద్య విభాగానికి అందించడంతో పేదలకు ఆధునిక వైద్యసేవలను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రతిరోజూ పదికి పైగా ఆపరేషన్లు చేస్తూ రోగుల ప్రాణాలు కాపాడుతున్నారు. 24 గంటల కడుపునొప్పి సమస్య మొదలుకొని అత్యంత క్లిష్టమైన ట్యూమర్లకు సైతం ఆపరేషన్లు చేస్తూ పేదల ప్రాణాలకు భరోసా కల్పిస్తున్నారు.

ప్రతిరోజూ 200 మందికి వైద్య సేవలు..

జనరల్ సర్జరీ ఓపీ విభాగంలో ప్రతిరోజూ 200 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఓపీ విభాగంలో రూమ్ నంబరు 19లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోమవారం నుంచి శనివారం వరకు ఓపీ వైద్యసేవలు అందిస్తున్నారు. అత్యవసర ఆపరేషన్ల కోసం వచ్చే రోగులకు క్యాజువాలిటీలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండి ఆపరేషన్ చేస్తున్నారు. పెద్ద ఆపరేషన్లు ప్రతిరోజూ ఎనిమిది చేసి రోగులకు వ్యాధుల నుంచి విముక్తి కల్పించడంతోపాటు, ప్రాణాపాయం నుంచి రక్షణ కల్పిస్తున్నారు. మైనర్ ఆపరేషన్లు ఏడు, ఎమర్జెన్సీ ఆపరేషన్లు ప్రతిరోజూ మూడు చేస్తున్నారు.

వైద్యుల నిరంతర పర్యవేక్షణ..

ప్రొఫెసర్లు డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ సత్య శ్రీనివాస్, డాక్టర్ సత్యవాణి, డాక్టర్ జి.కిరణ్‌కుమార్, డాక్టర్ చంద్రకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అమృతవల్లి, డాక్టర్ సత్తార్, డాక్టర్ ఎం.గోవిందనాయక్‌లతోపాటు 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 29 మంది పీజీ వైద్యులు నిరంతరం రోగులకు అందుబాటులో ఉండి జనరల్ సర్జరీ వైద్య సేవలు అందిస్తున్నారు. పైల్స్, పిస్టులా, లూటీ, హెర్నియా, గాల్బ్లాడర్ సమస్యలు, లాలాజల గ్రంథ సమస్యలు, ట్రామా కేసులు, కడుపులో నొప్పి, గడ్డలు, పేగుల్లో ఏర్పడే సమస్యలు, షుగర్ వల్ల ఏర్పడే సమస్యలు, థైరాయిడ్ సమస్యలు, బ్రెస్ట్ క్యాన్సర్, కాలిన గాయాలకు, ఇతర సమస్యలకు జనరల్ సర్జరీ వైద్య విభాగంలో వైద్య సేవలు అందిస్తున్నారు. కోత, కుట్లు లేకుండా అత్యాధునిక ల్యాప్రోస్కోపీ సర్జరీ సైతం పేద రోగులకు ఉచితంగా అందిస్తున్నారు.

ఓపీలో చికిత్స పొందిన వారి వివరాలు..

సంవత్సరం	రోగులు
2019	22,378
2020	13,228
2021	19,211
2022	24,502
2023(ఆగస్టు వరకు)	18,111

ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు

రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్య పరికరాలను జనరల్ సర్జరీ వైద్య విభాగానికి అందించింది. దీంతో కార్పొరేట్ ఆసుపత్రుల కంటే దీటుగా మెరుగైన వైద్య సేవలను, అత్యాధునిక వైద్యసేవలను, పేద రోగులకు ఉచితంగా అందిస్తున్నాం. సుమారు రూ.10 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్లు సైతం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి రోగులు ఆపరేషన్ల కోసం జీజీహెచ్‌కు వస్తున్నారు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

కోడి పందేల స్థావరంపై దాడి

తాడేపల్లిరూరల్: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన కృష్ణానది కనకదుర్గ వారధి వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరిబాబు అందించిన వివరాలు.. కోడిపందేలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.